మినీకథ

# తేడా

కె. ఈశ్వరమ్మ



ఆ రోజు మనసంతా చికాగ్గా వుంది మాధురికి. ఏ పనీ చెయ్యబుద్ధికాలేదు. అన్నం కూడా సరిగా తినాలనిపించ లేదు.

ఆదివారమే కదా, సినిమాకి వెళ్దాం రాకూడదూ! అంది చెల్లి. 'నాకు రావాలని లేదు.' అంది ముభావంగా. ఏదైనా కథ చదువుదామని పత్రిక తీసికొంది చేతిలోకి. కాని అదీ చదవాలని పించలేదు. పక్కన పడేసి బలవంతంగా కళ్ళు మూసుకొని పడుకుంది. నిన్న జరిగినసంఘటనే ఆమె తలలో గింగురుమని తిరుగుతూంది.

బాస్, ఎంత నాటకం ఆడుతున్నాడు? నిన్న కొంచెం లేటుగా వెళ్ళిందని ''ఇంత ఆలస్యమైతే ఎలా? రోజూ యిలా వస్తే పర్మిషన్ గ్రాంట్ చెయ్యను' అని బెదిరించాడు తనను. నిజానికి తను 5-10 నిముషాలకన్నా లేటుగా వెళ్ళదు. అది కూడా సిటీ బస్ లేటుగా వస్తే తన తప్పెలా అవుతుంది? ఆ మాత్రం కామన్‌సెన్స్ వాడికి లేదా అంటే వుంది. అయితే మరెందుకీ ఏడుపు? దానికీ ఓ కారణం వుంది. తను ఆ ఆఫీసులో జాయినయిన దగ్గర్నుంచీ తనకు రకరకాల ఎరలు వేస్తూనే వున్నాడు. ఎన్నిసార్లు తను ఆ నక్క నుంచి తప్పించుకోలేదు. తను ఉద్యోగంలో చేరిన కొత్తలో జరిగినసంఘటన ఇప్పటికీ మర్చిపోలేదు. ఆరోజు...బాస్ తనతో...

''సినిమాకి వెళ్దాం రేపు, వస్తారా?''

''సినిమాలంటే నాకు పెద్ద ఇంట్రస్ట్ లేదండీ!''

''ఓహ్! భలేవారే! ఈ రోజుల్లో సినిమా లంటే యిష్టంలేంది మిమ్మల్నే చూశాను! అలా కాదు. మీరు రేపు తప్పకుండా రావాలి! నేను టిక్కెట్లు తీసుకొని మీ కోసం చూస్తూ వుంటాను''.

''అహ అది కాదండీ'' ఇబ్బందిగా అంది మాధురి.

''నో నో, యింకేం మాట్లాడకండి! మీరు రేపు వస్తున్నారు''.

** ** **

ట్రిమ్‌గా ముస్తాబయి చేతిలో టిక్కెట్లతో, ఎదురుచూస్తూ నిలచున్న బాస్ దగ్గరికి వచ్చి 'నేను టిక్కెట్ తీసుకొని వస్తా, మీరిద్దరూ వెళ్ళండి''

''ఈవిడెవరండీ'' ఇబ్బందిగా అడిగాడు బాస్.

''ఓహ్! చెప్పనేలేదు కదూ, ఈవిడ మా నాన్నమ్మగారండి. సినిమాలంటే మహా పిచ్చిలెండి. పదండి'' అప్పుడు బాస్ మొహం ఎలా వుందో తలంచుకొంటే తనకిప్పటికీ నవ్వొస్తుంది.

ఆ తరువాతేం చేశాడు? ఆఫీస్ స్టాఫంతా పిక్నిక్ వెళ్తున్నారని తనను నమ్మించాడు. ఎంత మోసం! తీరా వెళ్తే తనొక్కడే వచ్చాడు. ఎందుకైనా మంచిదని తను తమ్ముడు రవిని కూడా తీసుకువెళ్ళింది కాబట్టి సరిపోయింది గాని లేకపోతే ఏమై వుండేది? అందుకే అతని ఉద్దేశ్యం కనిపెట్టిన తను మరింత దూరంగా వుండటానికి ప్రయత్నిస్తూంది. అది అతనికి సహించరానిదిగా వుంది. ఇక ఇన్‌డైరెక్టుగా లాభం లేదనుకుని డైరెక్టుగానే అడిగేశాడు బాస్ తనను. ఇక ఊరుకుంటే లాభం లేదని—ఇలాంటి వేషాలు ఇంకెప్పుడూ తన దగ్గర వెయ్యొద్దని, తను అలాంటి వ్యక్తిని కానని నిష్కర్షగా చెప్పేసింది. అందుకే తన మీద ఆ విరగబాటు. తను ఆఫీసు వర్కు ఎప్పుడూ బకాయిలు వుంచదు. అందుకే డ్యూటీ విషయంలో బాస్ తనవేమీ అనలేకపోతున్నాడు. ఇంక వాడికి దొరికిన వంకల్లా 10 నిముషాలు లేటుగా వెళ్ళడం. ఏం చెయ్యాలి? రేపటి నుంచి ఆటోలో వెళ్ళాలా? ఆలోచిస్తూ నిద్రపోయింది మాధురి.

మర్నాడు ఆమె ఆటోలో వెళ్ళింది ఆఫీస్ టైముకన్నా ఐదునిముషాలు ముందుగా. బాస్ ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు మాధురిని చూసి! చాచి లెంపకాయ కొట్టాలనిపించిందామెకు. కాని అది కూడని పని. తమాయించుకొని తన పనిలో నిమగ్నమైంది. ఐదు రోజులు గడిచాయి. తన జీతంలో సగం ఆటోకి వచ్చేలా వుంది, ఏమిటీ సమస్యకు పరిష్కారం? అని తీవ్రంగా ఆలోచిస్తున్న మాధురికి ఎడారిలో ఒయాసిస్సు కనిపించినట్లు ఓ చల్లని వార్త ఆమె



ఆంధ్రజ్యోతి సిబ్బంది ఇటీవల కార్తీక వన సమారాధన జరుపుకున్నప్పటి చిత్రం

చెవికి వినిపించింది. నాలుగు రోజుల్లో ఆఫీస్ ఇన్‌స్పెక్షన్ జరుగుతుందట! ఆఫీసరుగారు, సూపర్వైజరుగారు వచ్చి అంతా పర్యవేక్షించి సమస్యలుంటే పరిష్కరిస్తారట! ఎవరి సమస్యలనైనా వారికి విన్నవించుకోవచ్చునట! ఇదీ వార్త! మాధురి తన సమస్యను కూడా వారికి తెలియజేస్తే? బాస్‌కి పనిష్‌మెంటివ్వచ్చు. తను హాయిగా పనిచేసుకోవచ్చు అనుకుంది. ఈ ఆలోచన ఆమెకు ఎంతో ఊరట కలిగించింది. మనసులో కొంత కల్లోలం తగ్గి, ఆ రోజు ప్రశాంతంగా నిద్రపోయింది. ఆఫీసరుగారు బాస్‌కు చీవాట్లు వేసి, మరోచోటికి ట్రాన్స్‌ఫర్ చేసినట్టూ, మరో మంచి బాస్ తమ ఆఫీస్‌కు వచ్చినట్టు కల కూడా కన్నది.

తను చెప్పదలచుకున్నది రిహార్సలు వేసుకుని మరీ వెళ్ళింది ఆఫీసుకి. ఆఫీసర్ వచ్చారు. ఇన్‌స్పెక్షన్ అయింది. 'కాగితాలు వగైరా సరిగా ఇస్తున్నారా? మంచినీళ్ళకుండ పెట్టారా?' వంటి చొప్పదంటు ప్రశ్నలు వేస్తున్నారు ఆఫీసరు గారు. ఓపిగ్గా సమాధానం యిస్తున్నారందరూ! సమయం చూసి మాధురి నెమ్మదిగా వాళ్ళ బాస్ తన పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నాడని, అది తనకు కష్టంగా వుందనీ 'మనవి' చేసు కుంది. ఆయన 'అలాగా పాపం' అని విచారించి తరువాత 'చూడమ్మాయ్! ఇలాంటి విష యాలు మీరూ మీరూ 'ఎడ్జస్ట్' చేసుకోవాలి! మేమేం చేస్తాం' అన్నారు. "ఇది నా సమస్య సార్! మీరైనా సహాయం చేస్తారని కొండంత ఆశతో వున్నాను' అంది సవినయంగా. 'నువ్వం తగా అడుగుతున్నావు కాబట్టి ఆలోచిస్తాను. సాయంత్రం ఆఫీసు అయ్యాక ఈ ఎడ్రసుకి వచ్చి నన్ను కలువు!' అంటూ ఓ ఎడ్రసు కాగితం మాధురికిచ్చారు ఆఫీసరుగారు. ఆమె దానిని జాగ్రత్తగా తన పర్సులో దాచుకుంది. అది చూసిన కొందరు గుసగుసలాడుకున్నారు. వాళ్ళెందుకలా చెవులు కొరుక్కుంటున్నారో అర్థం కాలేదు మాధురికి. తన పనంతా చకచకా చేసేసి, అయిదుకల్లా బయటపడింది మాధురి. ఎడ్రసు కాగితం పైకి తీసి చదివింది. ఎలా వెళ్ళాలో తెలియులేదు. ప్యూన్ రంగయ్యను అడిగింది. 'ఆరింటికెళ్తావేటమ్మా? ఒంటరిగా మాత్రం పోమాక, ఆడకూతురివి, పొద్దుపోతే మందులో వుంటాడు గురుడు' హెచ్చరించి వెళ్ళాడు రంగయ్య. నీరుగారిపోయిది మాధురి. వెళ్ళటమా? మానటమా? సందిగ్ధంలో పడిందామె! 'తాగుబోతులంతా చెడ్డవాళ్ళనుకోవడం పొరపాటేమో! బహుశా ఆయన బాస్‌ని కూడా పిలిచి వుండవచ్చు. ఇద్దరినీ సంప్రదించవచ్చు. వెళ్ళడానికే నిశ్చయించుకొంది. వెంటనే ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. పరుగెత్తి రంగయ్యను వెనక్కి పిల్చి, తనతో తీసికెళ్ళింది. రంగయ్య బయట నిలుచున్నాడు. తనొక్కతే లోపలికెళ్ళింది.

"నువ్వు వస్తావని తెలుసు. అలా కూర్చో!" ముద్దగా వస్తున్నాయతని మాటలు.

"ఫరవాలేందడీ!" ప్రక్కగా నిలుచుంది. ఇంట్లో ఇంకెవరూ వున్న అలికిడి లేదు.

"మీ బాస్‌కి పనిష్మెంటిస్తే నువ్వు నాకేమిస్తావ్?" అదోలా చూస్తూ అడిగాడతను.

"అంటే... అంటే... ఇది..." మీదికి రాబోయాడు నిషాలో వున్న ఆఫీసరు. 'క్షమించండి!' తలుపు దగ్గరకొచ్చేసింది కంగారుగా! అతడు కూడా తలుపు దగ్గరకొచ్చే లోగా రంగయ్య బలంగా తలుపుతోసి 'పదమ్మా పోదాం! నే సెప్పలేదూ?' అన్నాడు. 'వెధవ!' కసిగా చూశాడు రంగయ్యను ఆఫీసరు.

కాళ్ళీడ్చుకొంటూ ఇల్లు చేరింది. వెళ్తూనే ఉసూరుమని కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకొంది నిస్సహాయంగా! వరండాలో నానమ్మ తన తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ, ఇంకా వీధిలోని చిన్న పిల్లల్ని చుట్టూ కూర్చోపెట్టుకుని కథ చెప్తూంది. వినాలని లేకపోయినా ఆ కథ మాధురి చెవిని పడుతూంది.

"అనగనగా ఓ బెల్లం ముక్క ఉండట్రా! తననెవ్వరూ బ్రతుకనివ్వడం లేదని, కనపడితే తినేస్తున్నారని బాధ కలిగి పాపం అది బ్రహ్మదేవుడి దగ్గరికి వెళ్ళి, తనను తియ్యగా ఎందుకు పుట్టించావని, తనను కాపాడమని మొరపెట్టుకుందట! అప్పుడు బ్రహ్మదేవుడేమన్నాడో తెలుసా? 'నీ కష్టాల మాట దేవుడెరుగు! (నేనూ ఎరుగను) నాకూ నోరూరుతుంది. నువ్వు యిక్కణ్ణుంచి తొందరగా పోకపోతే నేనే నోట్లో పడేసుకుంటా!' అన్నాట్ట. పాపం బెల్లం ముక్క తెల్లమొహం వేసికొని వచ్చేసిందట!" పిల్లలంతా గొల్లున నవ్వుతున్నారు. కథ విన్న మాధురికి కూడా నవ్వొచ్చింది. పాపం ఆ బెల్లం ముక్క చేసుకొన్న పాపమేమిటో? జాలిగా నవ్వుకొంది. అవును. ఆ బెల్లం ముక్క కథకూ తన కథకూ ఒక్కటే తేడా! అది పిల్లల కథ! ఇది తన కథ! అంతే!


SILENT MOVIE
HOME CINEMA PROJECTOR
Price Rs. 150/-



For detailed Catalogue book send Postage Stamps or M. O. for Rs. 2-50. Please write only in English.

Film Company
Post Box No. 289
Sivakasi 626 123, Tamilnadu